క్లుప్తంగా

ముగిసిన ఆధార్ మొబైల్ శిబిరాలు



సత్తెనపల్లి: పట్టణం, మండలంలోని వివిధ వార్డులు/ గ్రామాలలో ఈనెల 23 నుంచి ప్రారంభమైన మొబైల్ ఆధార్ అప్డేట్ శిబిరాలు శనివారంతో ముగిశాయి. పట్టణంలోని కంబాలభావి ఏరియాలోని సచివాలయం నందు (4వ సచివాలయం)లో శనివారం ఆధార్ శిబిరం నిర్వహించారు. ఆధార్‌లో పేర్లు తప్పులు సవరణ, మొబైల్ లింకింగ్, అప్డేట్, తదితర వాటిని ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ సురేష్ నిర్వహించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



సత్తెనపల్లి: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు, విపత్తులు సంభవించినప్పుడు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలో శనివారం డెమో నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సీనియర్ లీడింగ్ ఫైర్‌మ్యాన్ అలా శ్రీనివాసరావు, హోలీ ఫ్యామిలీ స్కూల్ ప్రిన్సిపాల్ విజయారాణా, ఫైర్‌మెన్‌లు శ్రీనివాసరావు, మహేంద్ర రెడ్డి, డ్రైవర్ సాగర్ బాబు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



నకరికల్లు: ఎరువులు, పురుగుమందులు నిబంధనలకు లోబడి క్రయవిక్రయాలు జరపాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. నకరికల్లులోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఆయా దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, బిల్ పుస్తకాలు, స్టాకు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన నాలుగురకాల ఎరువుల నమూనాలు సేకరించి నాణ్యతా ప్రమాణాల పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం

అచ్చంపేట: మండల ప్రింట్ మీడియా నూతన కార్యవర్గాన్ని శనివారం అచ్చంపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సలకేటి సింహరాయలు, కార్యదర్శిగా గుంజి రవికుమార్, సభ్యులుగా షేక్ సిద్దావలి, శాఖమూరి కోటిసత్యం నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కూరగాయ విత్తనాలు పంపిణీ

నార్నెపాడు(ముప్పాళ్ల): పేద ప్రజలకు బాలబాట ద్వారా ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని కార్డ్స్ సంస్థ పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు అన్నారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం కూరగాయ విత్తనాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న వారికి గురుకుల పాఠశాలలకు, మోడల్ స్కూల్స్ ప్రవేశాలకు శిక్షణ అందిస్తున్నామన్నారు. బాలబాట ద్వారా పది రకాల కూరగాయ విత్తనాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఏరియా కో-ఆర్డినేటర్ సీహెచ్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



పెదకూరపాడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహాయం చేస్తునే ఉంటానని విభ ఫౌండేషన్ అధినేత బి.నరసింహారావు అన్నారు. మండలంలోని 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాల అభివృద్ధికి శనివారం రూ.25,166లను ఐరన్ మెస్ గ్రిల్లింగ్ కోసం పాఠశాల హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు దాతలు సహకరించాలన్నారు. పేరెంట్స్ కమిటి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, తిరపతయ్య, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత అబ్దుల్ కలాం

మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఘననివాళి



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అబ్దుల్‌కలాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: భారతరత్న అబ్దుల్ కలాం గొప్ప ఆలోచనలు దేశంలో లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చాయని, అబ్దుల్ కలాం యువతకు మార్గదర్శకుడిగా, ప్రేరణగా నిలిచారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. మిస్సైల్ మ్యాన్, అణు శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్మకాయల మాట్లాడుతూ కలాం స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, జిల్లా గ్రంథాలయాల సంస్థ పూర్వ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు నాగూల్ బాషా, మార్కెట్ యార్డ్ పూర్వ వైస్ చైర్మన్ జలీల్ ఖాన్, నాయకులు రాజవరపు శివనాగేశ్వరరావు, గుజ్జర్లపూడి సతీష్, బండి మల్లిఖార్జునరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

పట్టణంలోని టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ క్షిపణి పితామహుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఫౌండేషన్ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు మాలెంపాటి సౌజన్య, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌లు మాట్లాడారు. హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో శనివారం భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు రేపటితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గార్లపాటి దాసు, బయ్యవరం ఎంపీటీసీ కడియం రామారావు, చిలక కిష్టారావు పెరుమాళ్ళపల్లి రాజశేఖర్ తదితరులున్నారు.



క్రోసూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో...

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్వామి వివేకానంద చైతన్య భారతి అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జేపీఎస్ శాస్త్రి కలాం జీవితంలోని స్ఫూర్తిదాయక విశేషాలను వివరించారు. సంస్థ ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు దేశానికి కలాం అందించిన సేవలను కొనియాడారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీవిశ్వనాథం వందన సమర్పణ చేశారు. సంస్థ సభ్యులు చలువాది చిన్న సత్యానారాయణ, తొమ్మండ్రు సత్యనారాయణ, దేవరశెట్టి రవికుమార్, రత్తయ్య, అన్నం మురళీ, అన్నం కృష్ణ, వెంకట నారాయణ, యోగా సాధకులు లక్ష్మయ్య, సునీల్, రంగారావు, భాను, ప్రభుదాస్, నగర సంకీర్తన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ రోడ్డులో అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ శ్రీధర్, తదితరులు

ఆరోగ్య ఉపకరణాలు పంపిణీ



పెదపాలెంలో ఆరోగ్య ఉపకరణాలు పంపిణీ చేస్తున్న అచ్చంపేట పీహెచ్‌సీ సిబ్బంది

అచ్చంపేట: జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణలో భాగంగా ఫ్లోరోసిస్, ఎముకల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పెదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం ఆరోగ్య ఉపకరణాలైన వాకింగ్ స్టిక్స్, నెక్ బెల్ట్స్, లంబార్ బెల్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్, ఎముకల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. అలాంటి వారు దగ్గర లోని పీహెచ్‌లో, సబ్ సెంటర్స్‌లో సంప్రదించవలసినదిగా కోరారు. టాబ్లెట్స్ ద్వారా ఉపశమనం పొందవచ్చని చెప్పారు. తాత్కాలికంగా నడవలేనివారికి వాకింగ్ స్టిక్స్ ద్వారా నడిచే అవకాశం ఉందన్నారు. మెడ, కండరాలు పట్టేయడం వంటి సమస్యలున్నవారికి నెక్ బెల్ట్స్, లాంబార్ బెల్ట్స్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకటరావు, హెచ్ఎస్ రాధాకృష్ణ, పాఠశాల హెచ్ఎం మహబూబ్ సుభాని, సీహెచ్ఓ శివనాగమణి, హెల్ అసిస్టెంట్ చిన్నపరెడ్డి, ఏఎస్ఎం ఎం.దుర్గ, ఆశా వర్కర్స్ ఎం.సుజాత, టి.చిన్నమ్మ, సీహెచ్ సుజాత, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

యానిమేటర్లపై వేధింపులు సరికాదు

సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు

అమరావతి: మండలంలో యానిమేటర్లపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా గ్రూపులు సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించటం, కట్టించటం ప్రభుత్వ పథకాలను తెలియపరచటం వంటి సేవ చేస్తున్న యానిమేటర్లు ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియ చేస్తూ కీలకంగా ఉన్నారన్నారు. ప్రజలకు వారందిస్తున్న సేవ అధికార పార్టీ నాయకులకు తెలియదా అంటూ ప్రశ్నించారు. రాజకీయ బహిరంగ సభలకు జన సమీకరణ కావాలంటే ముందుగా వారి సేవలను ఉపయోగించుకుంటూ వారినే వేధించటం దారుణమన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు చేసిన కృషికి ఫలితంగా వేధింపులు చేయటం ఎంతవరకు సమంజసమన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళలపై ఈ వేధింపులు తీవ్రస్థాయిలో ఉన్నాయన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి డ్వాక్రా గ్రూపుల మీద ఆధారపడి పనిచేస్తున్న యానిమేటర్ల పొట్ట కొట్టొద్దని, కుటుంబాలకు అన్యాయం చేయటం మంచిది కాదని హితవు పలికారు. అధికార పార్టీ నాయకులు ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

పెదకూరపాడులో పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్



మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న కార్మికులు

పెదకూరపాడు: పెదకూరపాడులో ఎంపీడీఓ మల్లేశ్వరి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య మెరుగుదల పనులను ఏక కాలంలో నిర్వహించారు. గ్రామంలో 16 వార్డులో 42 మంది పారిశుద్ధ్య కార్మికులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, మురుగు ముందుకు సాగేలా చర్యలు తీసుకున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. మురుగు వ్యర్థాలను ప్రత్యేక వాహనంలో తరలించి డంపింగ్ కేంద్రాలకు పంపించారు. వ్యాధులు ప్రబలకుండ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు సమ దుస్తులు పంపిణీ చేశారు.

ప్రగడ కోటయ్య జయంతి వేడుకలు



ప్రగడ కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చేతన సంఘం నాయకులు

పెదకూరపాడు: క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న చేనేత రంగానికి జవసత్వాలు ఊదిన మహానుభావుడు ప్రగడ కోటయ్య అన్ని పల్నాడు జిల్లా చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం అన్నారు. మండలంలోని లగడపాడు గ్రామంలో శనివారం చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యం మాట్లాడుతూ కోటయ్య చేనేత రంగం అభివృద్ధికి అలుపెరగని ఉద్యమం చేశారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో చేనేత యువత నడిచి చేనేత అభివృద్ధికి దోహదపడ్డాలన్నారు. గైవర అధ్యక్షుడు అనుముల వెంకట్రావు, చేనేత సంఘం నాయకులు మల్లిఖార్జునరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం

అమరావతి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శనివారం నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ చేపట్టినట్లు ఎంపీడీఓ జి.రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈక్నోల్ రూంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీనివాసన్ అందుబాటులో ఉంటారని ఆయన ఫోన్ నెంబరు 9908960733కు సంప్రదించవచ్చునన్నారు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భాను వెంకట సిద్ధార్థ టైపిస్ట్, 9014109890, రాత్రి 10 గంటల నుంచి తిరిగి ఉదయం 6 గంటల వరకు జూనియర్ సహాయకుడు ప్రఫుల్ల కుమార్, 9550182217 నెంబరులో అందుబాటులో ఉంటారన్నారు. పీఆర్ పీఎస్ఈ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు పారిశుద్ధ్యానికి సంబంధించిన ఫిర్యాదులు, వివరాలు తెలిపితే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఎంపీడీఓ రాణి తెలిపారు.

వైకుంఠపురం ఇసుక రీచ్‌లో వివాదం

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక రీచ్‌లో గేదెల యజమానులకు, లారీ డ్రైవర్లకు మధ్య వివాదం ఏర్పడింది. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ పంపిణీ చేస్తున్న వైకుంఠపురం రీచ్ వద్ద లారీలు నిలిచిపోయాయి. ఈక్రమంలో శనివారం వైకుంఠపురం గ్రామంలోని సుమారు 400 పశువులు రోజూలాగానే కృష్ణనదీ అవతల ఉన్న లంకకు మేత కోసం బయలుదేరాయి. లంకలకు వెళ్లాలంటే ఇసుకరీచ్ నుంచే వెళ్లాల్సి ఉండగా ఇసుక రీచ్ లారీలతో నిండిపోయి ఉండటంలో పశువులు వెళ్లే దారి లేకపోవటంతో పశువుల యజమానులకు లారీ డ్రైవర్లకు వివాదం మొదలైంది. పశువులు వెళ్లేందుకు దారిలో ఉన్న లారీలను అడ్డు తీయాలనే అంశంపై వచ్చిన వివాదం.. ఒకరిపై ఒకరు దాడి చేసుకునేదాక వెళ్లింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని లారీలను అడ్డు తీసి పశువులను లంకలకు పంపించటంతో వివాదం సద్దుమణిగింది

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎంఈఓ సత్యనారాయణ, సిబ్బంది

పెదకూరపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శిక్ష సప్తాహ్ లో భాగంగా ఆరోవ రోజు పెదకూరపాడులోని పలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంఈఓ కార్యాలయం వద్ద ఏంఈఓ సత్యనరాయణ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత సైతం అందరూ తీసుకోవాలన్నారు. హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధ విజయం అద్వితీయం



మాజీ సైనికోద్యోగి శ్రీనివాసరావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పిడుగురాళ్ల: కార్గిల్ యుద్ధ విజయం అద్వితీయమని, భారత సైనికులు వీర పోరాటానికి నిదర్శనమని బీజేపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతబోయిన హనుమంతరావు అన్నారు. పట్టణంలో కార్గిల్ విజయ్ దినోత్సవ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ భారత సైన్యం తమ త్యాగాలతో జమ్ము కశ్మీర్‌ను శత్రుదేశం పాకిస్థాన్ నుంచి కాపాడిందని కొనియాడారు. భారత సైన్య వీరోచిత పోరాటం మరువలేనిదన్నారు. అనంతరం మాజీ సైనికోద్యోగి చింతల శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో కేఎస్ఆర్ విద్యాసంస్థల అధినేతలు కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్‌రావు, డీఆర్‌డీఎస్ సంస్థ ప్రతినిధి గరికపాటి శంకరరావు, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకయ్య, రామాంజినేయులు, నరసింహారావు, ఆంజినేయులు, రాముడు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

సత్తెనపల్లి: యువత సేవాగుణాన్ని అలవర్చుకోవాలని అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలోని పేద మహిళలకు అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాపనపల్లి మధు, జ్యోతి దంపతులు శనివారం చీరలు పంపిణీ చేశారు. సంస్థ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు చింకా అంకమ్మరావు, పేరుబోయిన ప్రకాష్‌రావు, సి.వీర్రాజు, యాదవ్, తదితరులు.పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ లైన్లను క్రమబద్ధీకరించేందుకుగాను ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ శివకోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ ఆధారిత వ్యాపార సంస్థలు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

కొత్త చట్టాలపై బాలికలకు అవగాహన

అమరావతి: క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు మిషన్‌శక్తి 100రోజుల కార్యక్రమంలో భాగంగా మారిన మహిళ కొత్తచట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలలరక్షణ, సంరక్షణ విభాగం లీగల్ అధికారి జె.ప్రశాంతి మారిన మహిళా కొత్తచట్టాలైన బాల్య వివాహా నిరోధక చట్టం, లైంగిక నేరాలనుంచి బాలలరక్షణకు చట్టాలు, అలాగే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, వన్‌స్టెప్ సెంటర్ ఉమెన్ హెల్ప్‌లైన్ 181 గురించి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు

విద్యార్థులకు కిట్లు పంపిణీ

నకరికల్లు: దాతల ప్రోత్సాహం, సహాయ సహకారాలు అందిపుచ్చుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని వాసవీ క్లబ్ ప్లాటినం అధ్యక్షుడు వంకాయల ఆంజనేయులు సూచించారు. మండలంలోని చల్లగుండ్లలోని సున్నపుబట్టీ వద్ద గల ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు వాసవీక్లబ్ ప్లాటినం తరపున బోధన కిట్లను శనివారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం వై.లోకానందం, క్లబ్ ట్రెజరర్ కొప్పురావూరి బాల వెంకటరమణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వెలంపల్లి కేశవరావు, వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, శ్రీరామా సేవా ఫౌండేషన్ అధ్యక్షులు వేల్పుల కోటేశ్వరరావు, మేడా శ్రీనివాసరావు, పాట్టి వెంకటేశ్వర్లు, జూనెబోయిన వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్



ముప్పాళ్ళ: వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేర మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్‌ను శనివారం అందించారు. పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ధనుర్వాతం రాకుండా ఈ వ్యాక్సిన్ అందించటం జరుగుతుందని పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ తెలిపారు. 10 సంవత్సరాల సమయంలోను, 16 సంవత్సరాల సమయంలోను ఈ వ్యాక్సిన్ అందించటం జరుగుతుందన్నారు. మొత్తం 222 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ అందించామన్నారు. సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణిలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతా మాయా'జలం'!

శుద్ధి చేసిన నీరని చెబుతున్నారు.. కానీ ప్లాంట్లలో ఆ ఏర్పాట్లేమీ కనిపించవు.. అడ్డగోలుగా బోర్లు వేసి భూగర్భ జలాలను నిత్యం తోడేస్తున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. శుద్ధజలం పేరిట దోపిడీ చేస్తున్నారు. విచ్చలవిడిగా నీటి శుద్ధి కేంద్రాలు వెలుస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు పట్టించుకోవడం లేదు. వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) నిబంధనలు పాటించకుండా మినరల్ పేరుతో సాధారణ నీటినే విక్రయించి అక్రమంగా సంపాదిస్తున్నారు.

- శుద్ధనీటి పేరుతో సాధారణ నీటి విక్రయం
- నియోజకవర్గంలో అనుమతి లేని 120 ప్లాంట్లు
- నిర్వాహకుల తీరుతో ప్రమాదంలో ప్రజారోగ్యం
- అడ్డగోలుగా బోర్లతో వాల్టా చట్టానికి తూట్లు
- భూగర్భ జలాలను తోడేస్తున్నా పట్టని యంత్రాంగం



పెదకూరపాడులో నీరు విక్రయిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: సాధారణంగా 20 లీటర్ల నీటికి శుద్ధి చేశామని చెబుతూ రూ.8 , రూ.10, రూ.20 వరకు నిర్వాహకులు ఆయా ప్రాంతాల ఆధారంగా వసూలు చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బ తీసే ఇలాంటి నీటి వ్యాపారానికి కళ్లెం వేయాల్సిన అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, నర్సరావుపేట, చిలకలూరిపేట, గురజాల నియోజకవర్గంలో సుమారు 2,000 ప్లాంట్లు ఉన్నాయి. వాటిలో సగానికిపైగా అనుమతులు లేకుండా కొనసాగుతున్నట్లు సమాచారం. పెదకూరపాడు నియోజకవర్గంలో అనుమ తి లేని ప్లాంట్లు 120కుపైగా ఉన్నట్లు సమాచారం.

తాండవిస్తున్న అపరిశుభ్రత

మేజర్ పంచాయతీలో ప్లాంట్లు అపరిశుభ్ర వాతావరణంలో ఉన్నాయి. నీటి శుద్ధి తగిన ప్రమాణాల మేరకు చేయడం లేదు. కొన్ని చోట్ల నేరుగా బోరు నీటినే క్యాన్లలో నింపి విక్రయిస్తున్నారు. క్యాన్లు ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారు. కొందరు ఇళ్లలోనే ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. వాటర్ క్యాన్లకు ఎండ తగలకుండా టార్పాలిన్ పట్టతో ప్రత్యేకంగా నీడ ఏర్పాటు చేయడం లేదు. క్యాన్‌పై తయారీ కేంద్రాల చిరునామా, ఫోన్ నంబర్లు ప్రచురించడం లేదు. ఇంత జరుగుతున్నా అధికారులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నీటి నమూనాలను సేకరించి పరీక్షా కేంద్రాలకు పంపటం లేదు. ప్లాంట్లలో ఎయిర్ కండీషనర్‌తోపాటు కెమికల్ ల్యాబ్, మైక్రోబయాలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, బీఎస్ఐ నిబంధనలకు అనుగుణంగా స్టెయిన్‌లెస్‌తో ప్లాంట్ ఏర్పాటు చేయాలి. అధికారులు మూడు నెలలకోసారి ప్లాంట్లలో నీటి నమూనాలు సేకరించి పరీక్షించాలి. ఇప్పటికే వానాకాలం నేపథ్యంలో ప్రజలు డయేరియా వంటి రోగాల బారిన పడుతున్నారు. కలుషిత నీటి వల్ల ప్రాణాల మీదకు వస్తోంది. ఇప్పుడు ప్లాంట్లలో సరిగా శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల ప్రజలకు పలు ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా బోర్లు....

గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా బోర్లు వేసి వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. పంచాయతీ , రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకొని బోర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మరికొన్ని మండలాల్లోని గ్రామాల్లో కొందరు పంచాయతీ కుళాయిల నుంచి వచ్చే నీటినే అనుమతి లేకుండా ప్లాంట్లకు వాడుతున్నారు. వాటర్ ప్లాంట్లపై పర్యవేక్షణ అధికారం కేంద్ర ప్రభుత్వం పరిధిలోని బీఎస్ఐకి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకటి ,రెండు మినహా మిగిలిన ప్లాంట్లకు అనుమతులు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి ప్లాంట్లపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజారోగ్యం కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.